క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు



గన్నవరం: ఆర్టీసీ బస్సులు లేక గన్నవరం నియోజకవర్గ పరిధిలోని ప్రయాణికులు శుక్రవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అమరావతి రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమానికి జనం తరలింపు నిమిత్తం ఆర్టీసీ బస్సులను కేటాయించడంతో తీవ్ర బస్సుల కొరత ఏర్పడింది. గన్నవరం ఆర్టీసీ డిపోలో మొత్తం 60 బస్సులు ఉండగా 38 బస్సులను అమరావతికి జనం తరలింపునకు కేటాయించారు. మిగిలిన 22 బస్సులనే ప్రయాణికుల అవసరాల నిమిత్తం నడిపారు. దీంతో గ్రామీణ ప్రాంత బస్సు సర్వీస్‌లను రద్దు చేయడంతో పాటు విజయవాడ- హనుమాన్ జంక్షన్- ఏలూరు మధ్య తిరిగే పల్లెవెలుగు, సిటీ సర్వీస్‌లు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పలేదు. బస్సుల కోసం గంటల తరబడి రోడ్లపై ఎండల్లో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వాహనదారులు ప్రయాణికుల నుంచి అదనపుచార్జీలను వసూలు చేశారు.

గ్యాస్ లీకై పూరిల్లు దగ్ధం



ఉయ్యూరు రూరల్: స్టవ్ వెలిగించే క్రమంలో గ్యాస్ లీకై పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని కడవకొల్లులో శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పచ్చిగళ్ల జయపాల్ సుమారు 40 సంవత్సరాల నుంచి ప్రధాన రహదారి వెంట, ఎంపీపీ స్కూల్ గేటు పక్కన పూరిల్లు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జీవనోపాధి కోసం చిన్న బడ్డీ కొట్టును ఏర్పాటు చేసుకొని టీ అమ్ముకుంటూ భార్యాభర్తలు జీవిస్తున్నారు. రోజులానే టీ తయారు చేసేందుకు గ్యాస్ స్టవ్ వెలిగిస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు అలుముకున్నాయి. ఈ క్రమంలో జైపాల్ చేతికి గాయమైంది. మంటలు వ్యాపించడంతో జైపాల్ ఇంటి నుంచి పరుగులు తీశారు. స్థానికులు గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. వేసవి గాలులు వీస్తుండటంతో మంటలు అదుపు చేసేలోపే పూరిల్లు, బడ్డీ కొట్టు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో ఇంట్లో సామానుతో పాటు, కొంత నగదు, సైకిల్, మోటార్ సైకిల్ పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని జయపాల్ కోరారు.

పార్క్ చేసిన బైక్ చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ కనిపించడం లేదంటూ భవానీపురానికి చెందిన నీలం సౌజన్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. సౌజన్య భవానీపురంలోని జస్ట్ బేక్‌లో పనిచేస్తోంది. ఆమెకు షాపు తరపున బైక్ ఇచ్చారు. ప్రతిరోజు పని ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లి ఇంటి ముందు బైక్ పార్క్ చేస్తోంది. రోజులానే ఏప్రిల్ 27వ తేదీన రాత్రి షాపులో పనులు ముగించుకొని ఇంటి ముందు బైక్ పార్క్ చేసింది. మరుసటి రోజు లేచి చూడగా బైక్ కనిపించలేదు. దీనిపై భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):జిల్లాలోని నిరుద్యోగ యువతకు మే నెలల్లో వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. కటింగ్ అండ్ టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ హెల్పర్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిజం, డ్రస్ డిజైనింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ, హోమ్ క్రాఫ్ట్స్, జామ్ అండ్ జ్యూస్ మేకింగ్, స్మాకింగ్, టీ షర్ట్‌లపై స్క్రీన్‌ప్రింటింగ్, చాక్లెట్ మేకింగ్, శారీ ఫోల్డింగ్, ఫ్లవర్ మేకింగ్, మిర్రర్ వర్క్ అంశాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866- 2470 420 నంబరులో కానీ సంప్రదించాలని కోరారు.

బెజవాడ బార్ అసోసియేషన్‌కు కుర్చీల వితరణ

విజయవాడలీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌కి రూ. 28వేలు విలువచేసే 50 కుర్చీలను శుక్రవారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ వితరణ చేశారు. ఈ సందర్భంగా బీబీఏ అధ్యక్షుడు ఏకే బాషా మాట్లాడుతూ బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కక్షిదారుల సౌకర్యార్థం కుర్చీలను బహూకరించడమే కాకుండా బెజవాడ బార్‌కు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న అజయ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఎంఏ షరీఫ్, బీబీఏ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, కోశాధికారి మద్దాడ సత్యనారాయణ, లైబ్రరీ సెక్రటరీ కంచర్ల త్రినాథ్‌కుమార్, గవర్నింగ్ బాడీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నీరు ఇలా.. తాగేదెలా?

- యనమలకుదురు ఇందిరానగర్–2 కుళాయిల్లో కలుషిత నీరు సరఫరా
- చోడవరంలోనూ అదే పరిస్థితి
- గగ్గోలు పెడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపైనా శ్రద్ధ కరువు



యనమలకుదురు ఇందిరానగర్‌లో కలుషిత నీరు



చోడవరంలో కుళాయిలో కలుషిత నీరు

పెనమలూరు: ప్రజారోగ్యం, ప్రజాసంక్షేమాన్ని కూటమి పాలకులు పూర్తిగా వదిలేశారు. రక్షిత మంచినీటి పథకం కింద పేద ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి కుళాయిల్లో కలుషిమై సరఫరా అవుతున్నా పాలకులు చర్యలు తీసుకోవటం లేదు. దీంతో కలుషిత నీరు ఎలా తాగుతామని పేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విషయం ఇదీ..

తాడిగడప మున్సిపాలిటీ యనమలకుదురు గ్రామం ఇందిరానగర్– 2లో గత కొంత కాలంగా తాగునీటి సమస్య ఉంది. గుక్కెడు నీరు ఇవ్వమని గ్రామస్తులు కోరుతున్నా పాలకులు స్పందించటం లేదు. ఇందిరానగర్‌లో మూడు తాగునీటి బోర్లు ఉన్నాయి. వేసవి కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీని కారణంగా బోర్లు మొరాయించాయి. దీంతో మున్సిపాలిటీ ఇటీవల బోర్ వేసింది. అయితే బోర్ నుంచి పైప్‌లైన్‌ల ద్వారా కుళాయిలకు వచ్చే నీరు దారుణంగా ఉంటోంది. తాగునీరు ఎరుపు రంగుతో నలకలతో వస్తోంది. నీరు తాగే మాట ఎలా ఉన్నా దుస్తులు ఉతకటానికి, అంట్లు తోముకోవటానికి, ఇతర అవసరాలకు కూడా ఈ నీరు ఉపయోగపడే పరిస్థితి లేదు. కుళాయిల్లో రంగుమారిన నీరు రావటంతో స్థానికులు తాగునీటికోసం అల్లాడుతున్నారు.

అధికారులకు చెప్పినా..

నీటి సమస్య తీర్చాలని నివాసితులు మున్సిపాలిటీ అధికారులకు, కూటమి నేతలకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. అధికారులు, నేతలు ఇకనైనా స్పందించి గుక్కెడు నాణ్యమైన మంచి నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

చోడవరంలోనూ అదే పరిస్థితి..

కాగా చోడవరం గ్రామంలో కూడా కుళాయిల్లో రంగు మారిన నీరు సరఫరా అవుతోంది. రామాలయం వద్ద ఉన్న వాటర్ ట్యాంకు నుంచి సరఫరా జరుగుతున్న నీరు దారుణంగా ఉంటున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిల్లో నీరు కలుషితంగా వస్తున్నా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవటం లేదని చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి నీటి నాణ్యతను తనిఖీ చేయించి, వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తాగునీరు సరఫరా విషయంలో అధికారులు ఇంత నిర్లక్ష్యం చూపటం తగదని మండి పడుతున్నారు.



రంగుమారిన నీరు

ప్రత్యామ్నాయం చూపని అధికారులు..

తాగునీరు ప్రజలకు అత్యవసరం. అలాంటి తాగు నీటి సమస్య ఉత్పన్నమైనపుడు ప్రత్యామ్నా య చర్యలు చేపట్టటం అధికారుల బాధ్యత. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. అది అంత తొందరగా అయ్యేపని కానప్పుడు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసి ముందు తాగునీటి సమస్య తీర్చాలి. ఈలోగా సమస్య పరిష్కరించాలి. కానీ తాగునీటి సమస్యను గాలికి వదిలేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చోడవరం ఆలయ భూముల కౌలు వేలం

పెనమలూరు: చోడవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ చెన్నకేశవస్వామివారి దేవస్థానినికి చెందిన భూములకు కౌలు వేలం నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి యువీ. ప్రసాదరావు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ ఆలయానికి చెందిన ఆర్ఎస్ నంబర్ 213/1,2,3 లోని 3.29 ఎకరాల భూమిని 3 సంవత్సరాల కౌలు హక్కులకు వేలం (2028 సంవత్సరం వరకు) ఈ నెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో టెండర్ కం బహిరంగ వేలం దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

చిన కంచిలో ప్రత్యేక పూజలు



దుర్గాపురంలో ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకల్లో సంఘ సభ్యులు



ఆదిశంకరాచార్యులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి దేవస్థానం చినకంచిలో శ్రీ ఆదిశంకరాచార్యుల వారి జయంతి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం ఆదిశంకరాచార్యుల వారి జన్మనక్షత్రం కావడంతో చినకంచిలో ఆదిశంకరాచార్యుల విగ్రహానికి భక్తులు అధిక సంఖ్యలో అభిషేక అర్చనలు నిర్వహించారు. వేద విద్యార్థులు ఉపనిషత్తుల పారాయణ చేశారు. చిన కంచిలో జయేంద్రసరస్వతి స్వామీవారు ఆదిశంకరాచార్యుల వారి విగ్రహంతో పాటు వారి శిష్యులు నలుగురి విగ్రహాలను ప్రతిష్టంప చేశారని ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలియజేశారు.

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శుక్రవారం ఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఆదిశంకరా చార్యులకు అభిషేకం చేశారు. వేద పండితులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు దంపతులు వేద పండితులను సత్కరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు జీఆర్‌వీ.సాగర్, కార్యనిర్వహణాధికారి ఎస్.భవాని, భక్తులు పాల్గొన్నారు.



యనమలకుదురులో శ్లోకాలు పఠిస్తున్న భక్తులు

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం బ్రాహ్మణ పరిషత్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరచార్యుల చిత్రపటానికి బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి పూలమాలలు వేసి అభిషేకాలు, పూజ కార్యక్రమాలు జరిపారు. ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మం నలుదిక్కులా వెలుగొందేటట్లు చేసిన ఘనత ఆదిశంకరచార్యులకు దక్కుతుందన్నారు. దేశంలోని శృంగేరి, ద్వారకా, పూరి, జ్యోతిర్మ మఠాలను స్థాపించిన ఆయన సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు గోపరాజు సత్య పవన్‌కుమార్, మామిళ్ళపల్లి వెంకటనాగసుబ్బారావు, లక్ష్మణశాస్త్రి, యామర్తి వకుళ, వెంకటశివనాగేశ్వరరావు, వెంకట ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’ ఏర్పాట్లు పూర్తి

గన్నవరం: స్థానిక వీఎస్.సెయింట్‌జాన్స్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో ఈ నెల 4వ తేదీన జరిగే నీట్ – 2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం జరిగే ఈ పరీక్షకు తమ సెంటర్‌లో 480 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు నిర్ణీత సమయం కంటే ముందుగానే సెంటర్‌కు రావాలని సూచించారు. నిర్ణీత సమయం తర్వాత ఒక నిమిషం అలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతివ్వరని తెలిపారు. ఎగ్జామ్ సెంటర్ సూపరింటెండెంట్ ఎస్.యానీమాథ్యూస్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కంకట సుబ్బారావు పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీకొని ఇరువురికి గాయాలు

ఉయ్యూరురూరల్: విజయవాడ- మచిలీపట్నం నేషనల్ హైవేపై ఆనందపురం వద్ద శుక్రవారం ప్రమాదం చోటుచేసుకుంది. రహదారిపై వేగంగా వెళ్తున్న వాహనం ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేయడంతో వెనక నుంచి వస్తున్న ఓ కారు ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇరువురికి గాయాలు కాగా పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. గాయపడినవారిని పెడన మండలం, నందమూరు గ్రామానికి చెందిన జన్ను వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులుగా గుర్తించారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రమాదానికి గురైన కారు

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

పెనమలూరు: పోరంకి సెంటర్‌లో బందరు రోడ్డుపై జరిగిన ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలవగా పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి నారాయణపురం కాలనీకి చెందిన విట్టలకుమారి (69) తన కుమార్తెతో ఉంటుంది. ఆమె గురువారం భీమవరం నుంచి బస్సులో వచ్చి పోరంకి సెంటర్‌లో దిగింది. ఆమె నారాయణపురంకాలనీకి వెళ్లటానికి పోరంకి సెంటర్‌లో రోడ్డు దాటుతున్న సమయంలో విజయవాడ నుంచి కంకిపాడు వైపు వెళుతున్న కారు ఆమెను ఢీ కొట్టింది. ఈ ఘటనలో విట్టల కుమారి కాళ్లు చేతులు విరిగాయి. తీవ్రంగా గాయపడిన ఆమెను విజయవాడలో ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య చికిత్సకై చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్రాన్ని మరోసారి మోసం చేయొద్దు

సీపీఎం పశ్చిమ కార్యదర్శి సత్యబాబు

విద్యాధరపురం... వించిపేట(విజయవాడపశ్చిమ): రాజధాని నిర్మాణానికి రెండోసారి శంకుస్థాపన కార్యక్రమాలకు విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోదీ గత పది నెలలుగా ఆంధ్ర రాష్ట్రానికి చేసిన మోసాన్ని మరోసారి పునరావృతం చేయకుండా ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం విడుదల చేసిన బహిరంగ లేఖను పార్టీ నాయకులతో కలసి సత్యబాబు 50వ డివిజన్ గొల్లపాలెంగట్టురోడ్డులో ప్రదర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సీపీఎం ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాసినట్లు తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీలు అమలు చేయాలని, రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి నిధులు కేటాయించాలని, పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా పూర్తి చేయాలని, వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం ఆపాలని కోరుతూ ప్రధాని మోడిని బహిరంగ లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిన్నబాబు, బ్రహ్మజీ, శ్రీనివాసు, చింటూ తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీకి సీపీఎం రాసిన బహిరంగ లేఖను ప్రదర్శిస్తున్న సత్యబాబు

జగన్మాతకు నృత్య కళార్చన

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపైగల శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం నూతన రాజగోపురం ప్రాంగణంలోని కళావేదికపై ఆదిపరాశక్తి జగన్మాతకు నృత్య కళార్చన గావించారు. సనాతన ధర్మ ప్రచారం, లలిత కళలకు ప్రోత్సాహం అందించే దిశగా శుక్రవారం సాయంత్రం విజయవాడ నగరానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారిణులు తమ నృత్యాలతో కనకదుర్గ అమ్మవారికి కైమోడ్పులు సమర్పించారు. నాట్యాచారిణి, నృత్య గురువు బీహెచ్ భవానీ నేతృత్వంలో శిక్షణ పొందుతున్న 17 మంది కళాకారిణులు పలు భక్తి కీర్తనలకు లయబద్ధంగా నర్తించారు. తొలుత తాండవ నృత్యకరీ గజానన అంటూ వినాయకుని కీర్తిస్తూ నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం అమ్మవారిని కీర్తిస్తూ జయజయ దుర్గే అంటూ నర్తించారు. చక్కని ఆహార్యం, ఆంగికాభినయంతో ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా అలరించగా హర్షధ్వానాలతో వారిని ప్రశంసించారు. అనంతరం కళాకారుల బృందానికి కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

కోనేరుసెంటర్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకుంటామని, మచిలీపట్నం ఎక్సైజ్ ఎం.రామశేషయ్య హెచ్చరించారు. బందరు మండలం పోతేపల్లి గ్రామంలోని బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ఇరువురు యువకులను మచిలీపట్నం ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా రామశేషయ్య మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల మద్యం తాగడం వలన అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాటిని అరికట్టేందుకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో గ్రూపులుగా ఏర్పడి మద్యం తాగే వారిపై చర్య తీసుకోవడంతో పాటు సంబంధిత పోలీస్ స్టేషన్లకు వారిని అప్పగిస్తామని ఆయన హెచ్చరించారు. విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వై.శ్రీనివాస చౌదరి ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సభకు జనం తరలింపునకు నానా తంటాలు

సభకు బలవంతంగా తరలింపు



నున్న గ్రామంలో ఏర్పాటు చేసిన బస్సు

పెనమలూరు: అమరావతిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా జనాలను తరలించటానికి టీడీపీ నేతలు, అధికారులు నానా తంటాలు పడ్డారు. అయితే ప్రజల నుంచి స్పందన రాక పోవటంతో డ్వాక్రా మహిళలను టార్గెట్ చేసి వారిని బస్సుల్లో తీసుకువెళ్లారు. ప్రధాన మంత్రిని ప్రసన్నం చేయటానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు తాడిగడప మున్సిపాలిటీ నుంచి 50 బస్సులు, పెనమలూరు నుంచి 30 బస్సులు వేశారు. తాడిగడప మున్సిపాలిటీ నుంచి 3 వేల మంది, పెనమలూరు మండలం నుంచి 1500 మందిని తరలించటానికి గత రెండు రోజులుగా కసరత్తు చేశారు. పోరంకి పరిధిలో వంటలు వండించారు. అయితే బస్సులు ఎక్కటానికి ప్రజల నుంచి స్పందన కనబడలేదు. దీంతో డ్వాక్రా మహిళలను బలవంతంగా తరలించారు. ఇతర శాఖలకు చెందిన ఉద్యోగులను కూడా ఒత్తిడితో తరలించారు.

బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు

ఆర్టీసీ బస్సులు లేక జనాలు నానా ఇబ్బందులు పడ్డారు. మండల పరిధిలో ఉదయం నుంచి సిటీ బస్సులు తిరగలేదు. అప్పుడప్పుడు లైన్ బస్సులు మాత్రమే తిరిగాయి. ఇదే అదునుగా ఆటోవాలాలు అధిక రేట్లతో ప్రయాణికుల నుంచి చార్జీలు వసూలు చేశారు. బస్సులు లేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యారు.

సభకు మహిళలను పంపాలని ఒత్తిళ్లు

విజయవాడరూరల్: అమరావతి పునః ప్రారంభ పనుల ప్రారంభానికి శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ వస్తున్నరాని, తప్ప కుండా డ్వాక్రా గ్రూపుల నుంచి మహిళలను పంపాలని రిసోర్సు పర్సన్స్‌పై ఒత్తిళ్లు తెచ్చారు. విజయవాడ రూరల్ మండలం నుంచి 70 బస్సులను ఉదయం 7గంటలకే అధికారులు పంపడంతో గ్రామాల్లో డ్వాక్రా గ్రూపులకు చెందిన మహిళలు రుణాలు ఇవ్వరనే భయంతో తప్పనిసరి పరిస్థితిలో బయలుదేరి వెళ్లారు. ఒక్కో బస్సులో 45 మంది చొప్పున ఎక్కించాలని చెప్పినా కొన్ని బస్సుల్లో కొద్దిమందితో బస్సులు వెళ్లాయి.

కలవపాముల సర్పంచి బాలస్వామికి దేవభక్తుని పరామర్శ



సర్పంచ్ బాలస్వామితో మాట్లాడుతున్న దేవభక్తుని చక్రవర్తి

ఉయ్యూరు రూరల్: యువకుడి చేతిలో ఇటీవల గాయపడిన కలవపాముల సర్పంచ్ పోనుగుమాటి బాలస్వామిని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవ భక్తుని చక్రవర్తి శుక్రవారం పరామర్శించారు. ముందుగా ఘటనకు సంబంధించిన వివరాలను బాలస్వామి, ఆయన సోదరుని నుంచి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గ్రామ అభివద్ధి కోసం నిస్వార్థంగా సేవలందిస్తున్న సర్పంచ్‌పై మద్యం మత్తులో యువకుడు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన ఉయ్యూరు రూరల్ పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా ఆకతాయిలకు అవకాశం ఇవ్వకుండా చర్యలు చేపట్టాలని కోరారు. విధి నిర్వాహణలో ఉన్న సచివాలయ సిబ్బందిని దుర్భాష లాడడంతోపాటు దాడికి యత్నించిన యువకుడుపై ఉద్యోగుల ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టాలని కోరారు.

వైస్ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ..

ఉయ్యూరు మండల పరిషత్ వైస్ ఎంపీపీ గంజి సువర్ణలత భర్త సుభాకర్ (63)గురువారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థానంలో నియోజకవర్గ సమన్వయకర్త దేవా భక్తిని చక్రవర్తి ముదునూరు దూసరపాలెంలో గంజి సుభాకర్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఉయ్యూరు మండల పార్టీ అధ్యక్షుడు దాసే రవి, పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు. అనంతరం అదే ప్రాంతంలో ఇటీవల ఫిట్స్‌తో మృతి చెందిన మాజీ వలంటీర్ దూసర సునీత కుటుంబాన్ని పరామర్శించారు. మండలంలోని కాటూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎంపీపీ, ఎంపీడీఓ పరామర్శ..

గుండెపోటుతో మృత్యువాత పడిన ఉయ్యూరు వైస్ ఎంపీపీ గంజి సువర్ణలత భర్త సుభాకర్ భౌతికయాన్ని ఉయ్యూరు ఎంపీపీ చీలి కల్పన, ఎంపీడీవో శేషగిరిరావు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

బాలికల సాధికారత అందరి బాధ్యత



కానూరులో మాట్లాడుతున్న జిల్లా పీడీ రాణి

పెనమలూరు: కిశోర బాలికల సాధికారత అందరి బాధ్యతని మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఇ.రాణి అన్నారు. ఆమె శుక్రవారం కానూరు ఎస్సీ ఏరియా, కామయ్యతోపులో కిశోర వికాసం వేసవి సెలవుల కార్యక్రమంలో ప్రసంగించారు. కిశోర బాలికలకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, బాలికల అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలను ఒకరికి ఒకరిని పరిచయం చేశారు. కిశోర బాలికలు చదువుపై దృష్టిపెట్టాలని, లక్ష్యం కోసం చదవాలని సూచించారు. ఉన్నత చదువులు చదివితే సమాజంలో గుర్తింపు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కె.బేబీ సుకన్య, సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి, కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దూడ మృతి

ఇటీవల 25 పందెం కోళ్లు మృతి, మరో దూడకు గాయం



ఇటీవల గాయపడ్డ గేదె దూడను చూపుతున్న ఈశ్వర్‌రావు

కంకిపాడు: వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కల దాడిలో గేదె దూడ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. ఈడుపుగల్లు గ్రామానికి చెందిన గారా ఈశ్వర్‌రావు ప్రధాన గ్రామంలోని ఓ దొడ్లో గేదెలు మేపుతున్నాడు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఈశ్వర్‌రావు దొడ్డిపై కుక్కలు దాడి చేశాయి. దాడిలో ఈశ్వర్‌రావుకు చెందిన గేదె దూడ మృతి చెందింది. ఇటీవల జరిగిన కుక్కల దాడిలో ఓ గేదె దూడ గాయపడింది. 25 పందెం కోళ్లు మృత్యువాత పడ్డాయి. కుక్కలు స్వైర విహారం చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, కుక్కల దాడిని నియంత్రించాలని బాధితుడు ఈశ్వర్‌రావు కోరారు.

వెండి నాగపడగ సమర్పణ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి గుంటూరు జిల్లా కొల్లూరు మండలం యాదవపాలెం గ్రామస్తుడు డొక్కు శివ సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు సుమారు రూ.65 వేల విలువగల 525 గ్రాముల వెండితో తయారు చేసిన నాగపడగను స్వామివారికి కానుకగా సమర్పించుకున్నారు. శుక్రవారం ఆలయానికి చేరుకున్న వారు తొలుత స్వామివార్లను దర్శించుకుని పూజలు, అభిషేకం చేయించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావుకు స్వామివారి వెండి నాగపడగను అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. అధికారి కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.